# ఇకపై అప్పులు చేయను!

- ఆదాయం పెంచి పేదలకు పంచుతా
- అప్పు చేసి తినే పప్పు కూడుతో రాష్ట్రానికి ముప్పు
- అప్పుల వల్లే పథకాలు అమలు చేయలేకపోతున్నా
- స్టేషన్ ఘన్‌పూర్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే రికార్డుస్థాయిలో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేసి, తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇకపై తాను అప్పులు చేయదలుచుకోలేదని స్టేషన్ ఘన్‌పూర్ సభ సాక్షిగా స్పష్టంచేశారు. అప్పుచేసి తినే పప్పు కూడు, అప్పు ఎప్పటికైనా రాష్ట్రానికి ముప్పేనని తాను స్పష్టంగా నిర్ణయించుకున్నట్టు వివరించారు. ఇకపై అప్పులు చేయబోనని, రాష్ట్ర ఆదాయం పెంచి, పేదలకు పంచుతానని పేర్కొన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

**2 లక్షల మాఫీ అందరికీ చేయలే...**

రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించారు. గత ప్రభుత్వం అప్పులు చేయడం మూలంగా 15 నెలల పాలనలో రూ.1.53 లక్షల కోట్లు అసలు, మిత్తి చెల్లించామని ఆరోపించారు. ఆ మొత్తం నిధులు ఉంటే అర్హులైన 30 లక్షల మందికి రూ.5 లక్షల చొప్పున ఇచ్చి ఇండ్లను కట్టించేవాడినని స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో సీఎం పేర్కొన్నారు. 75 లక్షల మంది రైతులకు రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేసేవాడినని చెప్పారు. తాజా అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల్లోనూ రూ.2 లక్షల రుణమాఫీ పూర్తయిందని స్పష్టం చేసిన విషయం విదితమే.

**ఆర్థిక నిపుణుల విస్మయం**

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆర్థిక నిపుణులు, రాజకీయ విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి మించి నెలకు రూ.10 వేల కోట్ల చొప్పున, ఈ 15 నెలల్లో రూ.1.53 లక్షల కోట్లు అప్పులు చేయడమే కాకుండా నీతులు వల్లించడం ఏమిటని చెప్తున్నారు. ఎన్నికలకు ముందు అప్పులపై నానా యాగీ చేసి, నేడు అప్పుల కోసం వెంపర్లాడంపై విమర్శలు చేస్తున్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన అప్పులన్నీ అసలు, మిత్తిలకే కట్టామని అబద్ధాలు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఈసారి రూ.లక్షన్నర కోట్ల అప్పు?

- ప్రభుత్వ బడ్జెట్ రుణాలు రూ.80 వేల కోట్లు
- రూ.40 వేల కోట్ల బడ్జెటేతర రుణాలు తీసుకునే ప్లాన్
- భూముల తనఖాతో 30 వేల కోట్లు సమీకరణకు ప్లాన్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): 'మా ప్రభుత్వం ఇకపై అప్పులు చేయదలుచుకోలేదు' అని ఆదివారం వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినప్పటికీ అవన్నీ ఒట్టి మాటలేనని ఆర్థిక నిపుణులు కొట్టిపారేస్తున్నారు. సీఎం చేస్తున్న వ్యాఖ్యలకు, బడ్జెట్‌లో ప్రభుత్వ ప్రణాళికలకు సంబంధమే లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు రూ.3.15 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే లీకులు ఇచ్చింది. ఇది నిరుటి బడ్జెట్ కంటే దాదాపు రూ.24 వేల కోట్లు ఎక్కువ. సాధారణంగా రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సొంత పన్నులు, కేంద్ర పన్నుల్లో వాటా, పన్నేతర ఆదాయం బడ్జెట్‌లో ప్రధానాంశాలుగా ఉంటాయి. వీటితోపాటు ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలో తీసుకునే రుణాలను కలిపి రాష్ట్ర వార్షిక బడ్జెట్ అంచనాలను రూపొందిస్తారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రుణాలు కాకుండా రెవెన్యూ రాబడులను రూ.2.21 లక్షల కోట్లుగా అంచనా వేశారు. కానీ, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు సమర్పించిన లెక్కల ప్రకారం ఈ ఏడాది జనవరి నాటికి అన్ని మార్గాల ద్వారా ప్రభుత్వానికి రూ.1.24 లక్షల కోట్ల రాబడి మాత్రమే వచ్చింది. ఇది బడ్జెట్ అంచనాలో 56% మాత్రమే. దీంతో మిగిలిన రెండు నెలలు కూడా కలిపితే రాష్ట్ర రెవెన్యూ రాబడులు రూ.1.60 లక్షల కోట్లలోపే ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

**రూ.2 లక్షలలోపే బడ్జెట్ పెడతారా?**

రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేయదలుచుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్న మాట నిజమే అయితే రెవెన్యూ రాబడుల ఆధారంగా మాత్రమే బడ్జెట్ రూపొందించాల్సి ఉంటుంది. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిలో వచ్చే రుణాలను కూడా తీసుకోకూడదు. ఈ లెక్కన 2025-26 బడ్జెట్ రూ.2 లక్షల కోట్లలోపే ఉండాలి. కానీ, సుమారు రూ.3.15 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నట్టు రాష్ట్ర ఆర్థికశాఖ ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. గత బడ్జెట్‌లో రూ.2.21 లక్షల కోట్లుగా అంచనా వేసిన రెవెన్యూ రాబడులను ఈసారి రూ.2.40 లక్షల కోట్ల మేరకు పెంచబోతున్నట్టు సమాచారం. మిగిలిన రూ.75 వేల కోట్లను ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి లోబడి రుణాల రూపంలో తీసుకోనున్నట్టు తెలిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి రూ.50 వేల కోట్లే అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అంతకుమించి రుణాలు తీసుకున్నది. ఇదే తరహాలో ఈసారి జీఎస్‌డీపీ పెరగనున్నట్టు చూపించి ఏకంగా రూ.70-80 వేల కోట్ల రుణాలు సమీకరించాలని ప్లాన్ వేసినట్టు వినికిడి.

**ఓవైపు బడ్జెటేతర రుణాలు.. మరోవైపు భూముల తనఖాలు, అమ్మకాలు**

నిరుటి బడ్జెట్‌లో అంచనా వేసినంత ఆదాయం రాకపోవడంతో రోజువారీ నిర్వహణ, పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెటేతర రుణాల వైపు మొగ్గ చూపింది. బడ్జెట్‌లో పేర్కొన్న రుణాలకు తోడు కార్పొరేషన్లు, ఎస్పీవీల ద్వారా బడ్జెటేతర రుణాలు సేకరించింది. అధికారికంగా చెప్పిన లెక్కల ప్రకారం నిరుడు నవంబర్ నాటికే ప్రభుత్వం సుమారు రూ.61 వేల కోట్ల అప్పులు తీసుకుంది. ఇదే తరహాలో ఈ ఏడాది రూ.50 వేల కోట్ల వరకు బడ్జెటేతర రుణాలు తీసుకునే అవకాశం ఉన్నట్టు ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. మరోవైపు భూముల తనఖా, విక్రయాల ద్వారా భారీగా నిధులను రాబట్టుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అందులో భాగంగా ఇటీవల 400 ఎకరాలు తనఖా పెట్టి రూ.10 వేల కోట్ల రుణం తీసుకున్న సంగతి తెలిసిందే. వాటిని అమ్మడం ద్వారా రూ.30 వేల కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే విధంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని భూముల తనఖాలు, అమ్మకాల ద్వారా రూ.30 వేల కోట్ల వరకు సమీకరించుకోబోతున్నట్టు సమాచారం. ఇలా 2025-26లో రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రూ.లక్షన్నర కోట్ల మేరకు అప్పులు చేసే అవకాశం ఉన్నట్టు ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ప్రగతి సభలో సీఎంకు నిరసన సెగ

- రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తుండగా ఫ్లెక్సీ ప్రదర్శించిన మహిళలు
- సాంస్కృతిక సారథి ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్
- ఫ్లెక్సీ చింపేసిన పోలీసులు
- స్టేషన్ ఘన్‌పూర్‌లో సభలో కడియంకు రేవంత్ మద్దతు
- కాంగ్రెస్ ఇన్‌చార్జి గైర్హాజరు
- సీఎం సభలో చిన్న పిల్లలతో ర్యాప్ సాంగ్‌కు డ్యాన్సులు



జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం జరిగిన 'ప్రజాపాలన ప్రగతి బాట' బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డికి ఫ్లెక్సీతో నిరసన తెలిపిన మహిళా కళాకారులు

వరంగల్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/జనగామ చౌరస్తా: 'ప్రజాపాలన - ప్రగతి బాట' పేరిట జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిరసన సెగ తలిగింది. మహిళా కళాకారులు తమ డిమాండ్ల సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతుండగా ఫ్లెక్సీ ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సాంస్కృతిక సారథిలో తమకు ఉద్యోగాలు ఇవ్వాలని గుర్తు చేశారు. ఆ ఫ్లెక్సీని చూసిన రేవంత్‌రెడ్డి అసహనానికి గురయ్యారు. ఫ్లెక్సీని చూశానని, ఇక దించాలని ఆదేశించారు. కళాకారులు కూర్చునేలోపు ఒక్కసారిగా పదుల సంఖ్యలో పోలీసులు వారిని చుట్టుముట్టారు. దీంతో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొన్నది. మహిళా కళాకారుల ఫోన్లు, ఫ్లెక్సీని పోలీసులు గుంజుకున్నారు. వారిని ఈడ్చుకుంటూ సభ నుంచి బయటికి తీసుకువెళ్లారు. కొందరు చంటి బిడ్డలతో రాగా.. ముఖ్యమంత్రి మెప్పు కోసం పోలీసులు వారితోనూ దురుసుగా ప్రవర్తించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తుచేసేందుకు ప్రయత్నిస్తే అమానుషంగా ప్రవర్తించారని కళాకారులు వాపోయారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం తమకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**అసలు కాంగ్రెస్ నేతల దూరం**

బీఆర్‌ఎస్ తరఫున గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మద్దతుగా రేవంత్‌రెడ్డి ఈ సభలో ప్రసంగించారు. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలు కడియం శ్రీహరికి అండగా ఉండాలని కోరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దవుతుందనే చర్చ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి విన్నపం ఉపఎన్నికలకు సంకేతమని సభకు వచ్చినవారు మాట్లాడుకున్నారు. ఈ సభకు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సింగారపు ఇందిర హాజరు కాలేదు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న పదేండ్లు పార్టీ కోసం పనిచేసిన ఆమె ఈ సభకు దూరంగా ఉండటంపై కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. కడియం శ్రీహరి వచ్చిన తర్వాత మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నవారిని ఇబ్బంది పెడుతున్నారని ఇందిర ఇప్పటికే పీసీసీ, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు ఇందిర దూరంగా ఉండడంతో మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్న ఓ వర్గం సైతం సభకు రాలేదు.

**పిల్లలతో డ్యాన్సులు..**

ఈ సభలో ముఖ్యమంత్రి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే, సీనియర్ ఐఏఎస్‌లు, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో పాఠశాల పిల్లలతో స్టేజీపై ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు వేయించడంపై విమర్శలు వస్తున్నాయి. మొదట సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించగా.. ఆ తర్వాత ఎండలోనూ చిన్న పిల్లలతో నృత్యం చేయించడంతో సభకు హాజరైనవారు ఆశ్చర్యపోయారు. అనంతరం పిల్లలతో ఏకంగా ర్యాప్ సాంగ్‌లకు డ్యాన్సులు చేయించారు. దాదాపు పదేండ్లు విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రభుత్వ సభలో చిన్న పిల్లలతో ఇలాంటి డ్యాన్సులు వేయించడంపై సభకు వచ్చినవారు, ముఖ్యంగా మహిళలు పెదవి విరిచారు.

**రేవంత్ అన్న ఏంది ఇది..**

కాంగ్రెస్‌లో ఫిరాయించిన కడియం శ్రీహరి పరిస్థితి ఆయన సహజ వైఖరికి భిన్నంగా ఉన్నదని బహిరంగ సభకు వచ్చిన వారు చర్చించుకున్నారు. కడియం శ్రీహరి ప్రసంగంలో ప్రతిసారి ముఖ్యమంత్రిని రేవంత్‌రెడ్డి అన్న అని సంబోధించారు. కడియం శ్రీహరి కంటే దాదాపు 17 ఏండ్లు చిన్న వయస్సు ఉన్న రేవంత్‌రెడ్డిని గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్న, అన్న.. అని అనడం కొత్తగా ఉన్నదని... ఉప ఎన్నికలు వస్తాయనే ఆందోళనే దీనికి కారణమై ఉంటుందని సభకు వచ్చినవారు ముచ్చటించుకున్నారు.

**అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం: ఎమ్మెల్యే పల్లా**

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జనగామ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో పాటు వివిధ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం అప్రజాస్వామికమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పిరికిపంద చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. అక్రమంగా అరెస్ట్ చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వస్తున్నదని, అసమర్థ పాలనపై ప్రశ్నిస్తారనే బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేశారని మండిపడ్డారు. సీఎం పర్యటన స్టేషన్ ఘన్‌పూర్‌లో ఉంటే జనగామ నేతలను ఎందుకు అరెస్ట్ చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అక్రమ నిర్బంధాలతో నిరంకుశత్వాన్ని చాటుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హితవు పలికారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పల్లా తెలిపారు. కాగా, జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

## గులాబీలతో ఇబ్బంది..

స్టేషన్ ఘన్‌పూర్ పర్యటనలో భాగంగా బహిరంగ సభకు ముందు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటి నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతి స్టాల్‌లోనూ నిర్వాహకులు ముఖ్యమంత్రికి ఆత్మీయంగా వారి ఉత్పత్తులతో పాటు గులాబీ పూలను ఇచ్చారు. దీంతో రేవంత్‌రెడ్డి కొంత అసహనం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ రంగు గులాబీ కావడంతో స్టాళ్లలో పూలు తీసుకోవడానికి ఆయన ఇబ్బంది పడినట్టు ఓ ఐఏఎస్ అధికారి పక్కనున్న వారితో అనడంతో అక్కడ ఉన్నవారు నవ్వుకున్నారు.

## బీఆర్‌ఎస్ నేతల అక్రమ అరెస్టు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యే రాజయ్యను గృహ నిర్బంధంలో ఉంచిన పోలీసులు

సీఎం రేవంత్‌రెడ్డి జనగామ జిల్లా పర్యటన సందర్భంగా పోలీసులు ముందస్తుగా బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యే రాజయ్యను గృహ నిర్బంధంలో ఉంచారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో జిల్లాలో పంటలు ఎండిపోవడంతో సీఎం రేవంత్‌పై ఆగ్రహంగా ఉన్న రైతులు, నేతలు నిరసనలు తెలిపే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సూచనల మేరకు శనివారం అర్ధరాత్రి నుంచి పోలీసులు అరెస్టులు మొదలుపెట్టారు. బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు బీజేపీ, సీపీఎం, టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేశారు. వారిని పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. సీఎం సభ ముగిసిన తర్వాత సాయంత్రం 4 గంటలకు విడిచిపెట్టారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు డిస్‌క్వాలిఫై అవుతారని, రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని మంత్రి రాజయ్య విమర్శించారు.

## లక్షన్నర కోట్ల అప్పుతో ప్రజలకు ఒరిగిందేమిటి?

- కాంగ్రెస్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపాటు



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు ఎలాంటి ప్రణాళిక లేకుండా ఆరు గ్యారెంటీలను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే లక్షన్నర కోట్ల అప్పు చేసిందని దుయ్యబట్టారు. ఈ అప్పులతో ప్రజలకు ఒరిగిందేమిటి? రాష్ట్రంలో వచ్చిన మార్పు ఏమిటి? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి నుంచి తప్పించుకునేందుకే తమిళనాడు సీఎం స్టాలిన్ రెండునెలలుగా వితండవాదం చేస్తున్నాడని విమర్శించారు.

## రేవంత్.. ప్రజలే మీ బట్టలిప్పుతరు

- సీఎంపై ఏలేటి విమర్శలు



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి జర్నలిస్టులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డికి బట్టలు ఊడదీసే ఫాంటసీ ఏంటో అర్థం కావడంలేదని చురకలంటించారు. అది చట్టసభలో ముఖ్యమంత్రి మాట్లాడే భాషేనా అని నిలదీశారు. "ప్రజలు మీ బట్టలు విప్పేందుకు రెడీ అయితున్నారు. ముందు దానిమీద దృష్టి పెట్టండి" అని హితవు పలికారు. బీజేఎల్పీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఏకపాత్రాభినయం చేస్తున్నారని విమర్శించారు. ఇది హామీల ఎగవేతల, సమాధానాల దాటవేతల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. తాను గవర్నర్ ప్రసంగంపై ప్రశ్నిస్తే సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పకుండా దాటవేశారని, పసలేని జవాబులు చెప్పారని తీవ్రంగా మండిపడ్డారు.

# ఎస్‌ఎల్బీసీలో ఎదురుచూపులే

- మృతదేహాల ఆచూకీ కోసం శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు




ఎస్‌ఎల్‌బీసీ వద్ద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ సంతోష్, అధికారులు

అచ్చంపేట,దోమలపెంట మార్చి 16 : దోమలపెంట ఎస్‌ఎల్బీసీ సొరంగంలో చిక్కుకున్న మిగిలిన ఏడుగురి జాడ కోసం 23 రోజులుగా రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నారు. ఆదివారం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్ వద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో కలెక్టర్ సంతోష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే బృందం, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి మైన్స్, హైడ్రా, ర్యాట్ మైనర్స్ బృంద సభ్యులతో సహాయక చర్యలు కొనసాగిస్తూ, అవసరమైన అన్ని సౌకర్యాలను అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. దోమలపెంటలోని జడ్పీహెచ్‌ఎస్, యూపీఎస్, స్పోర్ట్స్ క్లబ్, ఈగలపెంటలోని జిమ్ సెంటర్, కళాభారతి, పటేల్ హాల్ తదితర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వసతి సదుపాయాలను పరిశీలించి, అవసరమైన మార్పులను అధికారులకు సూచించారు.

**సహాయ సిబ్బందికి వసతులు కరువు**

నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలంలో దోమలపెంట సమీపంలో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదానికి గురైన వారిని కాపాడటానికి ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి, హైడ్రా, రైల్వే తదితర శాఖల సిబ్బంది నిర్విరామంగా పనిచేస్తున్నారు. వారికి ఇక్కడి అధికారులు సరైన వసతులు కల్పించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. సహాయక బృందల కోసం గ్రామంలో యూపీఎస్, క్లబ్, ఈగలపెంట జెన్కోలోని జిమ్ హాల్, విద్యుత్ కళాభారతి, పటేల్ బిల్డింగ్‌లో వసతులు ఏర్పాటు చేశారు. ఆహారం, నీరు, మెడికల్ తదితర వసతులు లేక చాలా దయనీయమైన పరిస్థితి ఉందని, జెన్కోలోని విద్యుత్ కళాభారతి స్టేజీ మీద 150 మంది ఉంటున్నారు, జీహెచ్‌ఎంసీలో రెండు ఇన్‌స్టంట్ బాత్‌రూమ్స్ మాత్రమే ఉన్నాయి. పక్కనే నది ఉన్నా స్నానం చేయడానికి నీళ్లు లేని పరిస్థితి. రాత్రి పడుకోవడానికి సరైన స్థలం లేక విద్యుత్ కళాభారతి స్టేజీ మీద పడుకోవాల్సి వస్తుంది.

# డీకే అరుణ ఇంట్లోకి ముసుగుదొంగ

- అర్ధరాత్రి డీకే అరుణ ఇంట్లోకి ముసుగుదొంగ ప్రవేశం
- సీసీ కెమెరాల వైర్ కట్ చేసి, గృహంలోకి చొరబడిన వైనం
- నా ప్రాణాలకు ముప్పు ఉంది, భద్రత పెంచండి : అరుణ

మహబూబ్‌నగర్, మార్చి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/బంజారాహిల్స్ : హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఇంట్లో ఓ ఆగంతకుడు చొరబడిన ఘటన కలకలం సృష్టించింది. అరుణ నివాసంలోకి ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ముసుగు ధరించిన వ్యక్తి ఇంటి వెనకాల నుంచి వచ్చి వంటింటి కిటికీ గ్రిల్ తొలగించి లోనికి వెళ్లాడు. సీసీ కెమెరాల వైర్లను కట్‌చేసి లోపలికి వెళ్లి గంటన్నరకు పైగా ఇంట్లోనే ఉన్నాడు. ఓ బెడ్‌రూమ్‌లో వస్తువులను చిందరవందరగా పడేశాడు. విలువైన వస్తువులు లభించకపోవడంతో వచ్చిన దారినుంచే వెళ్లిపోయాడు. ఉదయాన్నే నిద్రలేచిన డీకే అరుణ చిన్న కుమార్తె ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడంతో విషయాన్ని కుటుంబసభ్యులకు చెప్పింది. ఈ ఘటన జరిగిన సమయంలో ఎంపీ డీకే అరుణ గద్వాలలో ఉన్నారు. కారు డ్రైవర్ లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

**నా భద్రతపై అనుమానాలు**

తన భద్రతపై అనుమానాలు ఉన్నాయని డీకే అరుణ పేర్కొన్నారు. 'నేను సీఎం రేవంత్‌రెడ్డి ఉండే ఏరియాలోనే నివాసం ఉంటాను.. అయినా దుండగులు చొరబడుతున్నారు.. ఇంతకు పోలీసులు ఏం చేస్తున్నారు? అని ప్రశ్నించారు. ఈ ఘటనను ఊహించుకుంటేనే భయమేస్తున్నది. అసలు దొంగ టార్గెట్ ఎవరు? నాకు ఏదైనా ప్రాణహాని తలపెట్టాలని చూస్తున్నారా? నాకు భద్రత పెంచండి" అని డీకే అరుణ ప్రభుత్వాన్ని కోరారు.

## కేసీ వేణుగోపాల్ హైదరాబాద్ పర్యటన

- బడ్జెట్ సమావేశాల తర్వాత మంత్రివర్గ విస్తరణ ?

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ త్వరలో హైదరాబాద్ రానున్నారు. బడ్జెట్ సమావేశాల అనంతరం రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, ప్రస్తుతం ఉన్న మంత్రుల శాఖల్లో మార్పులు ఉంటాయనే ప్రచారం నేపథ్యంలో కేసీ వేణుగోపాల్ పర్యటనపై పార్టీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొన్నది. ఈ పర్యటనలో భాగంగా ఆయన రాష్ట్ర కాంగ్రెస్ పొలిటికల్ కోర్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్టు సమాచారం. మంత్రి పదవులు ఆశిస్తున్నవారికి సంబంధించి పొలిటికల్ కోర్ కమిటీ సభ్యుల అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. మంత్రివర్గంలో మంత్రుల మధ్య అభిప్రాయభేదాలు, పార్టీకీ, ప్రభుత్వానికీ మధ్య సమన్వయ లోపం, నామినేటెడ్ పోస్టుల భర్తీ, 42% బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లుల వంటి అంశాలపై చర్చించే అవకాశాలున్నట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ చేపడితే, ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో కొందరికి ఉద్వాసన పలికే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. అదే జరిగితే ఎవరిని తొలగిస్తారు? కొత్తగా ఎవరికి అవకాశం ఇస్తారనే దానిపై జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు లెక్కలేసుకుంటున్నారు.

# దేశంలో పెరిగిన చేపల వినియోగం

- జనాభాలో 71.1 శాతం మంది వాడకం
- మహిళల కంటే పురుషులే అధికం..
- తెలంగాణ రాష్ట్రంలో 58 శాతం మందే..
- ఐసీఏఆర్, ఎంఏఎఫ్‌డబ్ల్యూ అధ్యయనంలో వెల్లడి



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : దేశంలో చేపల వినియోగం పెరిగినట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. ప్రజల్లో ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధతోనే ఈ మార్పు చోటుచేసుకున్నట్టు తెలిసింది. జమ్ముకశ్మీర్‌లో అనూహ్యంగా అత్యధిక పెరుగుదల కనిపించింది. భారతదేశంలో సాధారణంగా చేపల వినియోగాన్ని ప్యాటర్న్, ట్రెండ్‌ను బేస్ చేసుకుని అధ్యయనం చేస్తారు. ఈ అధ్యయనాన్ని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్), మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్, భారత ప్రభుత్వం అండ్ వరల్డ్ ఫిష్ ఇండియా సంయుక్తంగా నిర్వహించాయి. 2005 నుంచి 2024 వరకు చేపల వినియోగం ఎలా ఉందనే దానిపై అధ్యయనం చేయగా, దేశంలో గణనీయమైన వృద్ధి కనిపించినట్టు అధ్యయనం తెలిపింది. ఇందుకు జనాభా పెరుగుదల, పెరిగిన సంపద, మారుతున్న పరిస్థితులు కారణంగా పేర్కొన్నది.

**966.9 మిలియన్ల వినియోగం..**

భారతదేశంలో చేపలు తినే జనాభా 73.6 మిలియన్ల నుంచి 966.9 మిలియన్లకు(71.1శాతం)చేరింది. ఇది సుమారు 32 శాతం పెరుగుదలను సూచిస్తున్నది. తూర్పు ఈశాన్య రాష్ట్రాలు, తమిళనాడు, కేరళ, గోవాలో అత్యధికంగా చేపలు తినే వారి సంఖ్య (90 శాతం కంటే ఎక్కువ)ఉన్నది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్ వంటి ఉత్తరాది రాష్ట్రాలు అత్యల్పంగా(30 శాతం కంటే తక్కువ) ఉన్నాయి. జమ్ముకశ్మీర్‌లో చేపలు తినేవారి సంఖ్య అత్యధికంగా పెరగడం గమనార్హం. కేరళ, గోవాలోనూ రోజువారీ చేపల వినియోగ శాతం అత్యధికంగా ఉన్నట్టు అధ్యయనం వెల్లడించింది. తెలంగాణలో చేపలు తినేవారు మొత్తం జనాభాలో 58 శాతం మాత్రమే ఉన్నట్లు స్పష్టంచేసింది. రాష్ట్ర జనాభాలో చాలామందికి చేపలు తినాలనే కోరిక ఉన్నప్పటికీ.. వాటిలోని ముల్లల భయంతో చేపలు తినడానికి ఇష్టపడటం లేదని పేర్కొంది.

**దేశంలో చేపల వినియోగం ఇలా..**

**చేపలు తినేవారు : 71.1%**

| | |
|---|---|
| పురుషులు 68% | స్త్రీలు 48% |
| అత్యధికంగా వినియోగిస్తున్న రాష్ట్రం : త్రిపుర (99.35%) | అత్యల్పంగా వినియోగిస్తున్న రాష్ట్రం : హర్యానా (20.55%) |
| ప్రతిరోజూ చేపలు తినేవారి శాతం 5.95% | వారానికి ఒకసారి తినేవారి శాతం 34.8 % |

అప్పుడప్పుడు తినేవారి శాతం : 31.35%

**తెలంగాణలో..**

**రాష్ట్రంలో చేపల వినియోగం : 58%**

| | |
|---|---|
| పురుషులు 62% | స్త్రీలు 38% |
| ప్రతిరోజూ చేపలు తినేవారి శాతం 12% | వారానికి ఒకసారి తినేవారి శాతం 50 % |

## తలలు పట్టుకుంటున్న ఏఈవోలు

**పథకాల అమలుపై ఏవోలను నిలదీస్తున్న అన్నదాతలు**

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ఎంకి పెండ్లి సుబ్బి చావుకొచ్చిందన్న చందంగా తయారైంది వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో)ల పరిస్థితి. పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యం వీరికి శాపంగా మారుతున్నది. రుణమాఫీ, రైతుభరోసా అందకపోవడంతో రైతులంతా ఏఈవోలను నిలదీస్తున్నారు. తమకెందుకు రుణమాఫీ కాలేదని మాకెప్పుడు రైతుభరోసా వస్తుందని ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ప్రతిరోజు సుమారు100 మంది రైతులు ఫోన్లు చేస్తున్నట్టు ఏఈవోలు వాపోతున్నారు. ఓవైపు ఇతర పనులు చేస్తూ.. మరోవైపు రైతుల ఫోన్లకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దినెలలుగా ఏఈవోలపై పని భారం అధికంగా పెరిగిపోయింది.

**అన్నీ మాపై రుద్దితే..ఏ పనని చేయాలి..?**

ప్రభుత్వ, వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల తీరుపై ఏఈవోలు తీవ్ర ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. అన్ని పనులు తమకే అప్పగిస్తే.. ఏ పనని చేయమంటారని ప్రశ్నిస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే కోసం ఫీల్డ్‌కి వెళ్లిన సమయంలో రైతులు ఆఫీసుకు వచ్చి ఫోన్లు చేస్తున్నారని, తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొంటున్నారు.

# రసాయనాలతో మామిడిపండ్ల మగ్గింపు

- క్యాల్షియంకార్బైడ్ ఎంతో ప్రమాదకరమని వైద్యుల హెచ్చరిక



హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): వేసవికాలంలో సహజ సిద్ధంగా దొరికే మామిడిపండ్లను కొందరు వ్యాపారులు వివిధ రసాయనాలతో మగ్గపెడుతున్నారు. ఫలితంగా పలు వ్యాధులు సోకే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మామిడిపండ్లు తొందరగా పండటానికి క్యాల్షియం కార్బైడ్(కార్సినోజెన్) వంటి రసాయనాలను వ్యాపారులు వినియోగిస్తున్నారని దీనివల్ల క్యాన్సర్ కూడా వచ్చే అవకాశముందని పేర్కొంటున్నారు. అయితే జాగ్రత్తగా గమనిస్తే రసాయనాలతో మగ్గబెట్టిన పండ్లకు, సహజ సిద్ధంగా పండిన వాటికి తేడా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పండ్ల రంగు, వాసనల వల్ల కూడా వాటిలో తేడాను గమనించవచ్చునని పేర్కొంటున్నారు. దీనిని గమనించి మార్కెట్‌లో కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. అదేవిధంగా కొనుగోలు చేసిన పండ్లను తినేముందు వేడినీటిలో కొంత సేపు ఉంచిన తర్వాత దానిని తినాలని పేర్కొంటున్నారు.

## పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుండు లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఇటీవల ఉమ్మడి నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల టీచర్ ఎమ్మెల్సీగా ఎన్నికైన విషయం తెలిసిందే. లక్ష్మణ్ చేత మాజీ అధ్యక్షుడు పీ వెంకట్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి, వంగ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.